శ్రీరాముని ఆశీస్సులు పొందాలి


మణికొండలో శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

మణికొండ: దశాబ్దాల తరువాత అయోధ్యలో తన దేవాలయాన్ని నిర్మించుకుని ప్రతిష్టాపనకు సిద్ధమైన శ్రీ రాముని ఆశీస్సులను ప్రతి ఒక్కరు కుల, మతాలకు అతీతంగా పొందాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల కేంద్రంలో శ్రీ రాముని అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు ఉషారాణి, బి. కావ్యశ్రీరాములు, పి. శైలజ వినోద్, కోఆప్షన్ సభ్యుడు జె. సిద్ధప్పలు మాట్లాడుతూ అయోధ్య రామాలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి అక్షింతలను చేర్చాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో బృందాలుగా ఏర్పడి పర్యటిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. శ్రీరాములు, సి. బీరప్ప, రవికాంత్‌రెడ్డి, శ్రీప్రియరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మణికొండ గార్డన్ కాలనీలో అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


అక్షింతలను పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ, సురేష్

తెలంగాణ శాసన సభాపతికి సన్మానం


స్పీకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు పూలబోకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరికృష్ణా, గుండడ శేఖర్, గంగని రాజు, గుండడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను వినియోగించుకోవాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ప్రజా పాలనలో దఖాస్తులు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సంక్షేమ ఫలాలు అందాలంటే ఈ నెల 6వ తేదీ వరకు జరిగే ప్రజా పాలనలో దఖాస్తులను చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఈ శివనంద్, డిఈ యాదయ్య, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


నూతన సంవత్సర వేడుకలలో పాల్గొన్న సిబ్బంది, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2024 నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ వెంకటరమణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విశ్వవిద్యాలయం స్థాయిని పెంపొందించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన, విస్తరణ విదానిల్ని రూపొందించాలని అన్నారు. కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలనలో 2995 దరఖాస్తుల స్వీకరణ


ప్రజా పాలనలో పాల్గొన్న దరఖాస్తుదారులు

అత్తాపూర్: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అత్తాపూర్ డివిజన్ సెట్విన్ నౌ నంబర్ ప్రాంతాల్లో 2,995 దరఖాస్తులు వచ్చినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తుకు జవాబుదారితనంగా రిజిస్ట్రేషన్ చేయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజాపాలనకు రోజు రోజుకు స్పందన పెరుగుతుందన్నారు. పార్టీలకతీతంగా నాయకులు దగ్గరుండి దరఖాస్తులు నింపించడం జరుగుతుందని వివరించారు. బందోబస్తు కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ అర్షద్ అలీలు పాల్గొన్నారు.

అథ్లెట్‌కు అభినందనలు


భవానిని అభినందించిన ప్రిన్సిపాల్, సిబ్బంది

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో బోధనేతర సిబ్బందిగా పనిచేస్తూ ఇటీవల జీఎంసీ బాలయోగి స్టేడియంలో 10వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో 5వేలు, 4వందల మీటర్ల రేసులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మొదటి స్థానంలో నిలిచిన ఎం. భవానిని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఏఈసీ డైరెక్టర్ పి. సురేష్‌లు అభినందించారు. మంగళవారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జరిగే పోటీలలోను రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఓ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ 'మహిళ బిల్డింగ్' లో అభయ హస్తం సెంటర్


రాజేంద్రనగర్ ఉపకమిషనర్‌తో మాట్లాడుతున్న ధనుంజయ్

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకం దరఖాస్తులను ప్రజలకు మరింత చేరువలో ఉండే విధంగా చూడాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుంజయ్ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో నిర్వహిస్తున్న అభయ హస్తం కార్యక్రమాన్ని నాయకులతో ఉపకమిషనర్ పరిశీలించారు. ప్రేమావతి పేట్, భవాని కాలనీ ప్రజలు టీఎన్జీవోస్ కాలనీకి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నదని సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేశారు. దీనికి ప్రత్యామ్నయంగా ప్రేమావతి పేట్, బుద్వేల్ ప్రజల సౌకర్యార్థం జీహెచ్ ఎంసీ సర్కిల్ కార్యాలయం వెనుక అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో, రాజేంద్రనగర్ మహిళ భవనంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ఉపకమిషనర్ రవికుమార్ అవకాశం కల్పించారని వెల్లడించారు.

సమస్యల పరిష్కరానికి కృషి చేయండి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని మేయర్ మహేందర్‌గౌడ్ కోరారు. మంగళవారం రాజేంద్రనగర్ ఆర్డీవో ఈ. మల్లయ్యను మర్యాదపూర్వకంగా కలిసి కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ కిస్మత్‌పూర్ పాత గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కృషి చేయాలన్నారు. గతంలో పట్టాలు ఇచ్చిన ఇప్పటి వరకు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించలేదన్నారు. బాబామ్మ కాలనీలోని ధోబీఘాట్‌ను అభివృద్ధి పరిచి రజకులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. కిస్మత్‌పూర్‌లోని సర్వే నెంబర్ 111 లోగల మల్లన్న దేవాలయం స్థలంపై వివాదం కొనసాగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఈ స్థలాన్ని దేవాలయానికే అందించేలా పాటుపడాలన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, సంగారెడ్డి, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్‌గా బాలరాజు

శంషాబాద్: శంషాబాద్ ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్‌గా కొక్కొండ బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రనగర్ జోన్ సీసీఎస్ సీఐగా ఉన్న బాలరాజును బదిలీ చేశారు. ఇటీవలే ఆర్‌జీఐఏ సీఐ రాపోలు శ్రీనివాస్ ఓ కేసు విషయంలో సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో ఆర్‌జీఐఏ పీఎస్‌లో డీఐగా ఉన్న రాజు గత వారం రోజులుగా ఇన్‌చార్జి సీఐగా వ్యవహరిస్తున్నారు.

కౌన్సిలర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



శంషాబాద్: పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధిగా ఉన్న జహంగీర్‌ఖాన్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఇర్ఫాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీలో సత్తా చాటిన విద్యార్థులు


ట్రోఫీ, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రాజేంద్రనగర్: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను రాజేంద్రనగర్‌లో తోటి అబాకస్ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. 13వ జాతీయ అబాకస్ పోటీలు మహారాష్ట్ర పూణేలో నిర్వహించారు. ఈ పోటీల్లో దేశ నలుమూలల నుంచి 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌తో పాటు కిస్మత్‌పూర్‌లోని స్మార్ట్ కిడ్ లర్నింగ్ అకాడమీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో రిత్విక్, నిత్యశ్రీ, జోశ్రీతలకు మొదటి స్థానం. ప్రణయ్, యశ్వంత్‌లకు ద్వితీయ, నిహాల్ తృతీయ బహుమతులు అందాయి. వీరిని అకాడమీ డైరెక్టర్ గోపి మల్లేశ్వరి ఘనంగా సన్మానించారు. మొత్తం 6 మంది విజేతలుగా నిలిచారని తెలిపారు. గతంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారని గుర్తు చేశారు. విజేతలను ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులతో పాటు తోటి విద్యార్థులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రోత్సాహకం గెల్చుకున్న యువ ఇంజినీర్లు


బహుమతిని అందుకున్న విద్యార్థులు

మణికొండ: ఎలక్ట్రోఫోర్ట్ ఇన్నోవేషన్స్ అనే స్టార్టప్‌ను స్థాపించి ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ గార్డన్స్‌లో ఫౌండర్ ఫెస్ట్–2023లో ప్రతిభ చాటిన ఎంజీఐటీ విద్యార్థులు రూ.లక్ష ప్రోత్సాహకాన్ని గెల్చుకున్నారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈసీఈ, ఎంసీటీ విద్యార్థులు కె. వెంకట శ్రీరామ్, అనేప్, బృంధారెడ్డి, అభిషేక్ శర్మ, జయంత్, నితీష్, పవన్‌కుమార్‌రెడ్డి, దీపికా రాథోడ్‌లు రెండు నెలల క్రితం ఎలక్ట్రోఫోర్ట్ ఇన్నోవేషన్స్ అనే స్టార్టప్‌ను ప్రారంభించారన్నారు. ఆదివారం జరిగిన పోటీలలో 200కి పైగా స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో వారు పోటీ పడ్డారని తెలిపారు. అందులో రూ.లక్ష నగదును బహుమతిగా అందుకున్నారన్నారు. వారికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ నగదును అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, ఈసీఈ హెచ్ఓడీ ఎస్‌పీ సింగ్, మెంటార్ బాలరాజు తదితరులు విద్యార్థులను అభినందించారు.

రోడ్లను నిర్మించాలని కమిషనర్‌కు వినతి

బండ్లగూడ: ప్రజలకు సౌకర్యవంతంగా రోడ్లను ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి కోరారు. బైరాగిగూడ నుంచి నార్సింగి వెళ్లే దారిలో రోడ్లను తవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు తలారి ప్రేమ్ కుమార్, ఏ–బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కుమార్, శ్రీనివాస్, గణేష్, విష్ణు, శంకర్, శివ, మక్బూల్, నాయకులు, కార్యకర్తలున్నారు.


కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోటిగూడను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బోటిగూడ వాసులు

శంషాబాద్ రూరల్: మండలంలోని బోటిగూడను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు స్థానికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రామంజాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామంగా ఉన్న బోటిగూడలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రామంజాపూర్ నుంచి 2 కి.మీటర్ల దూరంలో ఉన్న బోటిగూడ వాసులు దూర భారంతో ఇబ్బందులు పడుతున్నట్లు విన్నవించారు. ఈ విషయంపై పంచాయతీ తీర్మాణం కాపీలు, ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్ నుంచి సిఫారసు పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాంజనేయ స్వామికి వెండి ఆభరణాలు


వెండి ఆభరణాలతో పెండ్యాల కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయానికి శ్రీ శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో వెండి ఆభరణాలను మంగళవారం అందజేశారు. హనుమంతుడితో పాటు శివలింగానికి అలంకరించేందుకు రూ.2.40 లక్షల వ్యయంతో తయారు చేసిన వెండి వస్తువులను అందించారు. ఉదయం పూజ కార్యక్రమాల అనంతరం దేవాలయం కమిటీ సభ్యులు హనుమంతునితో పాటు శివలింగానికి ఈ ఆభరణాలను అలంకరించారు. ఈ సందర్భంగా దాతలు పెండ్యాల రేణుక శ్రీనివాస్, పెండ్యాల ఆదిత్య, అనూష, పెండ్యాల సాయి మల్లిక్, నిహారిక, అనిధ్యలకు దేవాలయం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తమకు తోచిన వితరణ స్థానిక దేవాలయాలకు అందించాలన్నారు. దేవాలయాలు అభివృద్ధి చెందినప్పుడే స్థానిక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపిన నరేందర్‌ముదిరాజ్

మణికొండ: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ మంగళవారం కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సరంలో ప్రజలందరూ కోరుకునే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కార్యాచరణతో ప్రభుత్వం పని చేయాలని కోరారు. ఇప్పటికే అమలు చేస్తున్న రెండు సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని వివరించామని నరేందర్ తెలిపారు. ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలి


దరఖాస్తును తీసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించి వారికి అండగా నిలవటమే ప్రభుత్వాల లక్ష్యమని, వాటిని అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందని ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు హనుమాన్‌నగర్ కాలనీలో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవటం ప్రభుత్వాల పని అని అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అందించేందుకు దరఖాస్తులు తీసుకుంటుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరితో దరఖాస్తులు చేయించాల్సిన బాధ్యతను కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతి వార్డు పరిధిలో ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గతంలో ఉన్న రేషన్ కార్డులు, పింఛన్‌లు తొలగించారని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తిరిగి వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, మేనేజర్ కె. రమేష్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, స్థానిక కౌన్సిలర్ బి. కావ్యశ్రీరాములు, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ బి. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు పి. శైలజవినోద్, బి. పద్మారావు, ఎ. నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాలుగా కలిసి రావాలన్నారు.


నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే, తదితరులు

నా భర్త ఆస్తిని పిల్లలకు ఇవ్వండి

ఓ మహిళ మౌనదీక్ష


కమ్యూనిటీహాల్ ముందు పిల్లలతో మౌన దీక్ష చేస్తున్న సుధారాణి

మణికొండ: మమ్మల్ని అల్లారు ముద్దుగా చూసుకునే భర్త అనారోగ్యంతో చనిపోయాడు... మాకు రావలసిన ఆస్తిని తన పిల్లలకు కాకుండా ఆడపడుచులకు ఇచ్చి అత్త అన్యాయం చేస్తుందని, తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని ఓ మహిళ మౌన దీక్షకు దిగింది. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని శివాజీనగర్ కాలనీలో ఈ సంఘటన మంగళవారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెలితే... మణికొండ గ్రామ పంచాయతీకి వార్డు సభ్యునిగా పనిచేసిన ధన్‌రాజ్ అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం మరణించాడు. దాంతో ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుని భారం భార్య సుధారాణిపై పడింది. మున్సిపాలిటీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ వారిని చదివిస్తుంది. తన భర్త సంపాదించిన ఆస్తిని తన పిల్లలకు చెందనివ్వకుండా అత్త యాదమ్మ ఇటీవల ఆడపడుచులు సావిత్రి, రేణుకల పేరుపైకి మార్చింది. అది తెలిసి తనకు న్యాయం చేయాలని కాలనీ, గ్రామ పెద్దలకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోయింది.దీంతో పిల్లలతో కలిసి తనకు న్యాయం చేయాలని శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద మౌన దీక్షకు దిగింది.

వారంలో న్యాయం చేస్తాం...

ఆమె పరిస్థితిని తెలుసుకుని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్, వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్య నరేష్, రాయదుర్గం పోలీసులు స్పందించి వారం రోజుల్లో చర్చించి న్యాయం చేస్తామని హామి ఇచ్చారు. దాంతో ఆమె ఆందోళనను విరమించింది.

కొనసాగుతున్న ప్రజాపాలన


ప్రజాపాలన కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్

శంషాబాద్: ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రెండు రోజుల సెలవుల అనంతరం ప్రజలు మంగళవారం అభయ హస్తం దరఖాస్తులను అధికారులకు అందజేశారు. సాతంరాయిలో జరిగిన ప్రజాపాలన వేదికలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ పాల్గొని పరిశీలించారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయవంతంగా కొనసాగుతుందని ఆయన అన్నారు. అభయ హస్తం దరఖాస్తుల ఫారాలను అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు.

పెట్రోల్ బంకులలో బారులు తీరిన వాహనదారులు



రాజేంద్రనగర్: పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్ల సమ్మె కారణంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందన్న సమాచారంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పెట్రోల్ పంపులు వాహనదారులతో మంగళవారం కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనదారులు పెట్రోల్ పంపుల వద్ద బారులు తీరడంతో నిర్వాహకులు బంకులను మూసివేశారు. ఈ సందర్భంగా వాహనదారులు, పెట్రోల్ బంక్‌ల యజమానుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. కొత్త వాహనం చట్టాన్ని నిరసిస్తూ డ్రైవర్లు గత రెండు రోజులుగా సమ్మె చేపడుతున్నారు. పెట్రోల్, డీజిల్ తరలించే వాహనదారులు సైతం ఇందులో పాల్గొంటున్నారు. దీని కారణంగా పెట్రోల్ బంకులకు రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ సరఫరా కాలేదు. ఉన్న ఇంధనాన్ని బంక్ నిర్వాహకులు విక్రయిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి మరింత కొరత ఏర్పడుతుందని సోషల్ మాధ్యమాల్లో వార్తలు రావడంతో పెద్ద ఎత్తున వాహనదారులు బంక్‌లకు పెద్ద ఎత్తున్న పోటెత్తారు. దీంతో ఎక్కడ చూసినా వాహనాల రద్దీ ఏర్పడింది. బంక్ నిర్వాహకులు బంక్‌లను మూసివేయడంతో వాహనదారులు రాజేంద్రనగర్, హైదర్‌గూడ, ఆరాంఘర్ వద్ద యజమానులతో గొడవకు దిగారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు.